క్లుప్తంగా

ఇరుగులమ్మకు బోనాలు



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

గాలివీడు : మండలంలోని గోపనపల్లె గ్రామం పూజారివాండ్లపల్లె సమీపంలో వెలసిన ఇరుగులమ్మకు గ్రామస్తులు సాంప్రదాయబద్ధంగా ప్రతి సంవత్సరం బోనాలు సమర్పిస్తారు. ఆదివారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించారు. గ్రామంలో మంచి వర్షాలు కురిసి పాడి, పంటలు బాగా ఉండాలని అమ్మవారిని కోరారు.

రక్తదానం చేయండి ప్రాణాలను కాపాడండి



రక్తదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుల్లంపేట : రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి తెలియజేశారు. ఆదివారం రాజంపేట ఎంపీ, పార్లమెంట్ ప్యానల్ స్పీకర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలోని ఎస్‌బీవీడీ సభా జూనియర్ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలివీటి విజయసాగర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ బాబుల్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానాన్ని మించిన దానం మరొకటి లేదని, ప్రాణాలతో ఉంటూ మరొక ప్రాణాన్ని కాపాడుటయే మానవత లక్ష్యమన్నారు. రక్తం దానం ఇచ్చిన వారిలో మాజీ సర్పంచ్ విజయ భాస్కర్ రెడ్డి, అన్నమయ్య జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డిలతోపాటు దాదాపు 100 మంది రక్తదానం చేయడం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు : వెంకటరమణ కార్డియో, మెటర్నిటీ ఆసుపత్రి 17వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కోడూరు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ సి.వెంకటరమణ, స్త్రీల వైద్య నిపుణులు ఆర్.నిరుపమ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు ఉన్న జీవన ప్రయాణంలో ఒత్తిడి, ఆహారపు అలవాట్లు వల్ల గుండె సంబంధిత సమస్యలు వస్తున్నాయని తెలిపారు. అలాగే ఈ శిబిరంలో 440 మంది పేషెంట్లు హాజరైనట్లు తెలిపారు. ఇందులో ఉచితంగా ఈసీజీ, ఎకో, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



పిల్లలకు స్కూల్ యూనిఫాంను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

రామాపురం : మండలంలోని శ్రీ సద్గురు సాయి దర్బార్ ఆశ్రమాన్ని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, సతీమణి కృష్ణమ్మలు ఆదివారం సందర్శించారు. ఆశ్రమం అధికారులు, సిబ్బంది తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం పిల్లలకు పాఠశాల సమ దుస్తులను పంపిణీ చేశారు.

వానరానికి అంతిమ సంస్కారాలు



వానరానికి స్నానం చేయిస్తున్న స్థానికులు

రాయచోటి టౌన్ : తమ గ్రామంలో ఉంటూ తమ ఇళ్ల వద్దకు వచ్చి ఎంతో స్నేహంగా ఉండే వానరం (మారుతి) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. రాయచోటి రూరల్ పరిధిలోని సూరకవాండ్లపల్లెలో ఆదివారం ఆ వానరం మృతి చెందింది. దీనిపై స్పందించిన స్థానిక మహిళలు శ్రావణమాసం చివరి వారం కావడంతో ఈ కోతి మృతి చెందడం బాధాకరమన్నారు. మనుషులకు ఎలా దహన సంస్కారాలు నిర్వహిస్తారో అలానే వనరానికి అంతిమ సంస్కారాలు జరిపారు. ఈ దహన సంస్కారంలో స్థానిక మహిళలు బండపల్లె పుష్పలత, భానుప్రియ, భార్గవి, అమరనాథ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు



సిద్దవటం: గ్రామోత్సవానికి సిద్ధం చేసిన అమ్మవారి మూలవిరాట్



లక్కిరెడ్డిపల్లె: అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాతృమూర్తి



సంబేపల్లె: నల్లగంగమ్మను దర్శించుకొంటున్న భక్తులు

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు గావించారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శనం కోసం ఇతర ప్రాంతాలల్లో నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

లక్కిరెడ్డిపల్లె గంగమ్మ ఆలయంలో..

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గ్రామంలో భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమైన అనంతపురం గంగమ్మకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి, ఆయన సతీమణి కృష్ణమ్మ, జయచంద్రారెడ్డిలు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు వీరికి ఘనంగా స్వాగతం పలికి పూలమాలతో సన్మానించారు. అనంతరం వారు అమ్మవారికి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

వాసవీమాతకు గ్రామోత్సవం

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారి విగ్రహాన్ని పురవీధుల్లో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి దారి పొడవునా భక్తులు కాయాకర్పూరాలను సమర్పించారు. అమ్మవారిశాల వీధిలో వాసవీమాత ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ఆదివారం వేద పండితుడు యేలేశ్వర గురుస్వామి శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాలపూజ, మహన్యాస పూర్వాప రుద్రాభిషేకం (యంత్రాలకు)జపాలు, వేద పారాయణం, నైవేద్యం, మంగళహారతి, మంత్రపుష్పం, ప్రసాదాల వినియోగం, సాయంత్రం మహాస్వపన ధాన్యాధివాసం, శయ్యాధివాసం, అతీహిత హోమములు, నైవేద్యం, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాదాల వినియోగం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

వసతి గృహాల ఆకస్మిక తనిఖీ



మధ్యాహ్న భోజనంను పరిశీలిస్తున్న బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి

సిద్దవటం : మండలంలోని సరస్వతీపురం, పార్వతీపురం గ్రామాల్లోని బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశామని కడప డివిజన్ అసిస్టెంటు బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి.జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె సరస్వతీపురంలోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల హాజరు, స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశామన్నారు. ఇక్కడ విద్యార్థులు తాగునీటి మోటర్ మరమ్మతులకు గురైందని, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. మోటర్ మరమ్మతులు చేయించాలని వార్డెన్‌కు తెలియజేశామన్నారు. బాలికల వసతి గృహంలో వార్డెన్ లేకపోవడంతో అక్కడ రిజిస్టర్‌లను తనిఖీ చేయలేదన్నారు. అక్కడి 4వ తరగతి ఉద్యోగుల సమస్యలను తెలుసుకున్నామన్నారు. వార్డెన్ లేని కారణంగా ఆమెపై జిల్లా ఉన్నతాధికారులకు రిపోర్టు చేస్తానని అన్నారు. పార్వతీపురం వసతి గృహంలో రిజిస్టర్‌లను, మధ్యాహ్న భోజనంను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వసతి గృహాల వార్డెన్‌లు నాయక్, యాకోబ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె బస్టాప్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జల్లావాండ్లపల్లె గ్రామానికి చెందిన గౌడు, లక్ష్మమ్మ అనే దంపతులకు గాయాలైనట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దంపతులు ఇరువురు జల్లావాండ్లపల్లె నుంచి పాలను తీసుకొని డైరీలో వెయ్యడానికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా దేవగుడిపల్లె బస్టాప్ వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో వారిని ఏపీ39 ఎల్‌డీ 0909 నెంబర్ గల కారు ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో గాయాలైన దంపతులను 108 సాయంతో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

సోమశిల ముంపు ప్రాంతీయులకు పక్కాఇళ్లు!



ఎమ్మెల్యేను కలిసిన సోమశిల ముంపు గ్రామాల బాధితులు

రాజంపేట : రాజంపేట మండలం పోలి గ్రామ పరిధిలో ఉన్న స్థలాలలో సోమశిల ముంపు ప్రాంతీయులకు పక్కా ఇళ్లు మంజూరు చేసే అంశాన్ని రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం మేడా భవన్‌లో సోమశిల మునక ప్రాంతాలైన చుక్కాయపల్లె, చాపరవారిపల్లె తదితర గ్రామాలకు చెందిన ముంపు బాధితులు ఎమ్మెల్యేను కలిసి పోలి వద్ద తమకు ఇంటిస్థలాలు, పక్కా ఇళ్లు నిర్మితం చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ సమస్యను ఎంపీతోపాటు జిల్లా కలెక్టరు, ఆర్డీఓల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానన్నారు. సోమశిల ముంపు బాధితులు వీలైనంత న్యాయం చేసేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. కార్యక్రమంలో రాజంపేట మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యుడు రాముయాదవ్, కౌన్సిలర్లు పసుపులేటి సుధాకర్, కూండ్ల రమణారెడ్డి, పెద్దాసుపత్రి డైరక్టరు ఉమామహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలగిరి మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీ-20పై ఎన్‌సీసీ విద్యార్థులకు అవగాహన



వీధినాటికను ప్రదర్శిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

చిట్వేలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసువుల రాజశేఖర్ ఆధ్వర్యంలో జీ-20 సమ్మిట్‌పై గత రెండు రోజులుగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ 30 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రాజ్ కుమార్ తాప ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని నివారించడం, వాతావరణ మార్పులను తగ్గించడం, సుస్థిరాభివృద్ధి, డిజిటలీకరణ తదితర అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి వాటి కృషికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకున్నప్పుడే జీ-20 సమావేశాల లక్ష్యాలను సాధించినట్లు అవుతుందన్నారు. అనంతరం పాఠశాలలోని వేమన కళా వేదికలో మొదటి ప్రదర్శన చేసి తరువాత పాఠశాల గేటు ముందు వీధిలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఏబీఎస్ ప్రసాద్, జీ-20పై వీధి నాటిక ప్రదర్శన చేసిన ఎన్‌సీసీ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గరాజు, ఎన్‌సీసీ సీనియర్, జూనియర్ విద్యార్థులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు, వ్యాయామం అందరికి తప్పనిసరి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

గాలివీడు : క్రీడల పట్ల క్రీడాకారుల్లో నాయకత్వ, ఐక్యమత్యం, పోరాటే స్ఫూర్తి, స్నేహభావం వంటి సుగుణాలు అలవాటుపడతారని ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆవుల నాగభూషన్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గోరాన్‌చెరువు గ్రామం వడివలవంకలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవనానికి, క్రమశిక్షణకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అంతేగాక క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం పొందవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలు, వ్యాయామం నిత్యజీవితంలో తప్పనిసరి చేసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ-2 శ్రీనివాసులు, సర్పంచ్‌లు ఉమాపతిరెడ్డి, హరీష్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ తంగాల వెంకటరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు కసిరెడ్డి శివారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వెంకటాద్రి, మాజీ ఎంపీటీసీ చిన్నరెడ్డి, మైనార్టీ యువ నాయకులు నిజాముద్దీన్, రమణారెడ్డి, సుబ్బారెడ్డి, అమీన్ పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

పెనగలూరు : వైఎస్సార్ సీపీ కో-కన్వీనర్ గోవిందు నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డిపై ఉన్న ప్రేమాభిమానాలతో కువైట్, గల్ఫ్ వైఎస్సార్‌సీపీ నాయకులు చక్రంపేటకు వచ్చి చీరలు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఎంతో గొప్పవిషయమన్నారు. అంతకు ముందు కేక్‌ను కట్ చేసి మహిళలందరికీ పంచిపెట్టారు. అనంతరం గోవిందునాగరాజు మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గతంలో కూడా ఇక్కడ భారీ మెడికల్ క్యాంపు నిర్వహించి పేద ప్రజలకు సేవ చేయడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. అలాగే ఎంపీ పుట్టిన రోజును పురస్కరించుకొని పేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో గల్ఫ్ కన్వీనర్ ఇంతియాజ్, కువైట్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలిరెడ్డి, కువైట్ కో-కన్వీనర్ ఎంవీ నరసారెడ్డి, యూత్ సభ్యులు సత్తార్, రహ్మతుల్లా, హరినాయుడు, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, ముస్లిం మైనార్టీ నాయకుడు ఇంతియాజ్, హైస్కూల్ చైర్మన్ రమేష్ రెడ్డి, సర్పంచ్ రాజకుమార్, కువైట్ వైఎస్సార్‌సీపీ గౌరవ సలహాదారు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ ఈశ్వరయ్య, మాజీ సర్పంచ్‌లు ధనుంజయరెడ్డి, ఆంజనేయులు రెడ్డిలతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కువైట్‌లో విస్తృతంగా సేవలు

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కువైట్, గల్ఫ్ దేశాలలో విస్తృతంగా సేవ కార్యక్రమాలు చేస్తున్నామని కువైట్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలిరెడ్డి తెలిపారు. ఆదివారం కువైట్, గల్ఫ్ నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులతో ప్రత్యేకంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని కువైట్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. కువైట్‌లో పార్టీ స్థాపించినప్పటి నుంచి ఇండియా వారు ఎవరైనా కువైట్‌లో ఇబ్బందులు పడుతుంటే వారికి సహాయం చేస్తూ ఆదుకుంటున్నామన్నారు. అలాగే ఎక్కడైనా ప్రమాదాలు జరిగినా, ఇతర ఏ సమస్యలతోనైనా ఇబ్బందులు పడుతుంటే అటువంటి వారందరికీ కువైట్, గల్ఫ్ వైఎస్సార్‌సీపీ ఒక కమిటీగా ఏర్పడి వారందరికీ సేవలు అందిస్తున్నామని తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

సిద్దవటం : మండలం లోని మాధవరం-1 గ్రామానికి చెందిన మండల చెన్నయ్య(76) అనే వృద్ధుడిని ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మృతి చెందినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాధవరం-1 గ్రామానికి చెందిన చెన్నయ్య ఆదివారం తెల్లవారుజామున టీ తాగేందుకు నడుచుకుంటూ వెళుతుండగా రాజంపేట వైపు నుంచి కడప వైపునకు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొందన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చెన్నయ్యను చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ చెన్నయ్య మృతి చెందాడన్నారు. మృతుడి కుమారుడు చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో రోగుల సమస్యలు తెలుసుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు వారు ఉచితంగా నిర్వహింపచేసే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని దివాన్ సాహెబ్ దర్గా ఎదురుగా జిన్నా సేవా సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి సంకల్ప ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాతో కలసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దాతలు ఎంతో సదుద్దేశంతో ఏర్పాటు చేసే ఉచిత వైద్యశిబిరాలను పేదలు, రోగులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా లబ్ధి పొందాలన్నారు. రోగుల సౌకర్యార్థం జిన్నా సేవా సంస్థ స్పెషలిస్టు డాక్టర్లచే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహింపచేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో గుండె వైద్య నిపుణులు నాగరాజ్ కుమార్, ఫిజిషియన్ అండ్ డయాబెటాలజిస్టు రాజశేఖరరెడ్డి, యూరాలజిస్ట్ అండ్ ఆండ్రాలజిస్ట్ వినయ్ భరద్వాజ్, ప్రసూతి వైద్యురాలు వాణిరెడ్డి, న్యూరో సర్జన్ డాక్టర్ సుదర్శన్, ఫిజియోథెరపిస్టు డాక్టర్ రహంతుల్లా తదితరులు పాల్గొని రోగులకు వైద్యసేవలందించారు. ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ నేతలు బేపారి మహమ్మద్‌ఖాన్, ఆసిఫ్‌అలీఖాన్, రియాజుర్ రహిమాన్, ఫయాజ్ అహమ్మద్, రియాజ్, అర్జ్ శంకర్, కొత్తపల్లె ఇంతియాజ్, సంకల్ప ఆసుపత్రి పీఆర్‌ఓ వలీ పాల్గొన్నారు.

మహిమాన్వితుడు కేవలానంద లక్ష్మీనారాయణ స్వామి

రామాపురం : కేవలానంద లక్ష్మీనారాయణ స్వామి మహిమాన్వితుడు అని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామం బి.రాచపల్లెలో మల్‌రెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కేవలానంద లక్ష్మీనారాయణస్వామి విగ్రహ ప్రతిష్ఠ తొలి పూజలో ఆయన పాల్గొన్నారు. ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఆయనతోపాటు సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, సత్యయాదవ్, మల్‌రెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంతాపం

రామాపురం మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీకి చెందిన గంపా నాగభూషన్ అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం గంపా నాగభూషన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, యువజన విభాగపు రాష్ట్ర కార్యదర్శి సూరం వెంకటసుబ్బారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, సత్యాయాదవ్ తదితరులు నివాళులు అర్పించారు.

కార్యకర్త శంకర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

సంబేపల్లె : వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త శంకర్‌రెడ్డి భౌతికకాయానికి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం నివాళులర్పించారు. మండల పరిధిలోని గున్నికుంట్ల గ్రామం కత్తివాండ్లపల్లె చెందిన శంకర్‌రెడ్డి శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుకొన్న ఎమ్మెల్యే మృతి స్వగ్రామానికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, శివారెడ్డి, శేఖర్‌రెడ్డి, కొండారెడ్డి, జనార్దన్‌రెడ్డిలు ఉన్నారు.

తాళ్లపాకలో అన్నమయ్య పద నృత్య వైభవం



నృత్య ప్రదర్శనకు హాజరైన వారితో అన్నమాచార్య వంశీయులు

నందలూరు (రాజంపేట) : తాళ్లపాక వంశీయులు స్థాపించబడిన అన్నమయ్య సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలమైన తాళ్లపాకలో ఆదివారం వైభవంగా అన్నమయ్య పదనృత్య వైభవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం నిత్య హారతి కైంకర్యాదార్ తాళ్లపాక శేషాదర్ రవి కుమార్ ఆచార్యులు మాట్లాడుతూ తాళ్లపాక అన్నమాచార్య జన్మస్థలమైన తాళ్లపాకలో అన్నమయ్య పదనృత్య వైభవం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అన్నమాచార్య సంకీర్తనలు ప్రపంచ వ్యాప్తంగా విస్తృతం కావాలన్నదే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు నటరాజ కళాక్షేత్రానికి చెందిన మొహిద్దీన్ ఖాన్, కైకలూరు కూచిపూడి ప్రిన్సిపాల్ పసుమర్తి శ్రీవల్లి, హైదరాబాదు నటరాజ్ నృత్య సమితి కె.తరంగిణి, కడప నాట్య కళాభారతికి చెందిన కె.కామేశ్వరి, విశాఖపట్నం మ్యూజిక్ అకాడమీ కళారాధన డ్యాన్సుకు చెందిన తాళ్లపాక సందీప్ కుమార్, రైల్వేకోడూరు కీర్తి డ్యాన్సు అకాడమీకి చెందిన వేంపల్లి హసీనా, రాజంపేట శివా డ్యాన్సు అకాడమీ, మూవీ కొరియోగ్రాఫర్ పెనగలపాటి శివప్రసాద్‌లు పాల్గొన్నారు.

నివాళి

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని వైకోట హరిజనవాడ గ్రామంలో వేణుగోపాల్ (47) మృతి చెందాడు. ఆదివారం ఏపీ టూరిజం డైరెక్టర్, మండల కన్వీనర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి వేణుగోపాల్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీటీసీ జి.దుర్గా ప్రసాద్, పాణ్యం చంద్ర పాల్గొన్నారు.

అన్నదానం

రాజంపేట : ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తండ్రి టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మేడా రామకృష్ణారెడ్డి వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఉభయజిల్లాల నుంచి తరలి వచ్చిన వందలాది మంది వాల్మీకులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అలాగే వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు నల్లబోతుల శంకరయ్య, గణేష్(దాతలు), నిర్మాణానికి నల్లబోతుల ఈశ్వరయ్య తనయులు డా.కళ్యాణతేజ్, డా.భరత్‌తేజ్, రామ్‌నగర్ ధర్మయ్య, ఏపీఎస్పీడీసీఎల్ ఓఎస్డీ శ్రీనివాసులు సహకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండు గోపి, కౌన్సిలర్లు రాముయాదవ్, పసుపులేటి సుధాకర్, కూండ్ల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలు, ర్యాలీలకు అనుమతి లేదు

రైల్వేకోడూరు : మండలంలో 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరూ కూడా ఎటువంటి ధర్నాలు, ర్యాలీలు, నిరసనలు చేపట్టడానికి అనుమతిలేదని ఆదివారం ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కావున ఎవరైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. సామాన్యమైన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజాశాంతి ఆటంకం కలిగించరాదని, ప్రజలతో పాటు వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు.